

మాదార జలపాతం వద్ద యువకుల సందడి


# నమస్తే తెలంగాణ

## మంచిర్యాల
## కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | మంగళవారం 23 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




కోటపల్లి : వెంచపల్లి గ్రామ సమీపంలో ప్రాణహిత నది ప్రవాహంతో నీట మునిగిన పత్తి పంట



## మిట్టె జలపాతాలు

లింగాపూర్ అడవుల్లోని మిట్టె జలపాతాలు

లింగాపూర్ అడవుల్లో ఉన్న మిట్టె జలపాతాలను.. సప్త గుండాలు అని కూడా పిలుస్తుంటారు. ఇక్కడి అడవుల్లో ఒకదాని తర్వాత ఒకటి.. ఇలా ఏడు జలపాతాలు ఉన్నాయి. దట్టమైన అటవీప్రాంతం వల్ల రెండు జలపాతాలను మాత్రమే చూసే అవకాశముంది. జిల్లా కేంద్రం నుంచి సుమారు 80 కిలోమీటర్ల దూరంలోనున్న లింగాపూర్ మండల కేంద్రానికి బస్సులో చేరుకోవచ్చు. అక్కడి నుంచి పిట్టగూడ వరకు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే వీలుంది. ఈ గ్రామం నుంచి దాదాపు మూడు కిలోమీటర్లు నడిస్తే మొదట పెద్ద మిట్టె వస్తుంది. సుమారు 10 అడుగుల ఎత్తు నుంచి నీరు జాలువారుతుంది. ఇక్కడి నుంచి కొంత ముందుకెళ్తే రెండో మిట్టె కనిపిస్తుంది. 80 అడుగుల నుంచి కిందకు దూకే ఈ జలధార ఆకట్టుకుంటుంది.

# ప్రకృతి ఒడిలో జలసవ్వడి

## ఆకట్టుకుంటున్న జలపాతాలు

- ఎత్తైన కొండలపై నుంచి జాలువారుతూ కనువిందు
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివస్తున్న సందర్శకులు

కుమ్రం భీం ఆసిఫాబాద్( నమస్తే తెలంగాణ)/ తిర్యాణి, జూలై 22 : జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అడవుల్లోని జలపాతాలు పరవళ్లు తొక్కుతూ కనువిందు చేస్తున్నాయి. చుట్టూ దట్టమైన అటవీప్రాంతం.. ఎటు చూసినా పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలపై నుంచి.. రాళ్ల మధ్య.. జాలువారే నీటి ధారలు ఆకట్టుకుంటున్నాయి. ఈ జలపాతాలను తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.



### మాదార జలపాతం

తిర్యాణి మండలంలోని పండిగి మాదార జలపాతం 60 అడుగుల పై నుంచి బండపరుపులపై దుంకుతూ.. ఆపై కిందకు ప్రవహిస్తూ ఉంటుంది. జిల్లా కేంద్రం నుంచి దాదాపు 60 కిలోమీటర్ల దూరంలోనున్న తిర్యాణి మండల కేంద్రానికి చేరుకోవాలి. అక్కడి నుంచి 15 కిలోమీటర్లు బస్సులోగాని, ఇతర ప్రైవేటు వాహనాల్లోగాని మాదారం గ్రామం వరకు వెళ్లవచ్చు. అక్కడి నుంచి మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్తే ఈ జలపాతాన్ని చూడవచ్చు.



### గుండాల జలపాతం

తిర్యాణి మండలంలోని గుండాల జలపాతం సరికొత్త అందాలకు వేదికైంది. దాదాపు 60 అడుగుల ఎత్తు నుంచి కిందకు దూకే పాల నురగల్లాంటి ధారలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి సుమారు 60 కిలోమీ టర్ల దూరంలోనున్న తిర్యాణి మండల కేంద్రానికి వెళ్లాలి. అక్కడి నుంచి గుండాల జలపాతం దాదాపు 19 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తిర్యాణి మండల కేంద్ర నుంచి 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న రోంపపల్లి వరకు బస్సులో వెళ్లవచ్చు. అక్కడి నుంచి 9కి.మీ. కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది.

# ముంచెత్తిన వరద

**• వేలాది ఎకరాల్లో నీటమునిగిన పంటలు • రైతులకు తీరని నష్టం • పరిశీలించిన అధికారులు**



కోటపల్లి : ఆలుగామ గ్రామం సమీపంలోకి వచ్చిన ప్రాణహిత వరద



కోటపల్లి : జనగామ సమీపంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఈవో అనూష



దహెగాం : ప్రాణహిత బ్యాక్‌వాటర్‌తో నీట మునిగిన పత్తి

దహెగాం/నెన్నెల/వేమనపల్లి/కోటపల్లి, జూలై 22 : ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు వరద ముంచెత్తుతున్నది. నదులు, ప్రాజెక్టులు, వాగులు.. వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా, పరివాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. దహెగాం మండలంలో ప్రాణహిత, పెద్దవాగు బ్యాక్‌వాటర్‌తో రావుపల్లి, మొట్లగూడ,రాంపూర్, దిగడ గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల పత్తి నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో వరదతో చేలల్లో ఇసుక మేటలు వేశాయి. పలుచోట్ల మొలకలు కొట్టుకుపోయి నష్టం వాటిల్లింది. రైతులు ఆదుకోవాలని వేడుకుంటున్నారు. సోమవారం మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ పంటలను పరిశీలించారు. నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని ఆయన తెలిపారు. ప్రాణహిత ఉప్పొంగడంతో వేమనపల్లి, ముల్కలపేట, సుంపుటం గ్రామాల్లోని పత్తి పంటలు నీటిలో మునిగాయి. తహసీల్దార్ రమేశ్, మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్ నాటు పడవల ద్వారా వెళ్లి పంటలను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మునిగిపోయిన పంటల గురించి కలెక్టర్‌కు నివేదికలు అందిస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీ, డిప్యూటీ తహసీల్దార్ కమల్‌సింగ్, ఏఈవో రుక్సర్ సుల్తానా, మాజీ సర్పంచు గాలి మధు, రాంచందర్, మాజీ ఉపసర్పంచు తిరుపతి రెడ్డి, మాజీ కో ఆప్షన్‌సభ్యుడు పూర్ణచందర్‌రెడ్డి ఉన్నారు. అలాగే కల్లెంపల్లి, ముక్కిడిగూడెం, జాజులపేట, రాచర్ల సమీపంలో సుమారు 400 ఎకరాల్లో పత్తి పంటలు నీటి మునిగిపోయాయి. కోటపల్లిలో ప్రాణహిత నది నిండుగా ప్రవహిస్తున్నది. వెంచపల్లి, సూపాక, ఆలుగామ, జనగామ, పుల్లగామ, సిర్సా, అన్నారం, ఎదుల్లబంధం, అర్జునగుట్ట గ్రామాల్లో సుమారు 864 ఎకరాల పంటలకు నష్టం జరిగినట్లు కోటపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. నీట మునిగిన పంటలను ఏఈవోలు అనూష, వైష్ణవి పరిశీలించి నష్టం అంచనా వేశారు. ప్రాణహిత నది ప్రవాహం పెరుగుతుండడంతో సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చేపల వేటకు వెళ్లకూడదని, నది దాటే ప్రయత్నం చేయకూడదని ఎస్ఐ రాజేందర్ హెచ్చరించారు.



నెన్నెల : నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఏఈవో శ్రీకాంత్



చింతలమానేపల్లి : గూడెం అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రమాదకరంగా ప్రాణహిత నది

## పోటెత్తుతున్న..

హాజీపూర్, జూలై 22 : మండలంలోని గుడిపేట శివారులో నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 148 మీటర్లుకాగా, సోమవారం సాయంత్రానికి 143.93 మీటర్లకు వరద చేరింది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 10.5575 టీ ఎంసీల నీరు ఉంది. 24,433 క్యూసెక్కుల వరద వస్తుండగా, 331 క్యూ సెక్కుల నీటిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## నాల్గో రోజూ జలదిగ్బంధంలో దిందా

చింతలమానేపల్లి, జూలై 22 : ఎడతెరిపి లేని వర్షాలకు దిందా-కేతిని వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ప్రాణహిత నదితో పాటు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దిందా గ్రామస్తులు ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంది. నాల్గో రోజూ గ్రామం జలదిగ్బంధంలోనే ఉంది. గూడెం-అహేరి అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రాణహిత నది నిండుకుండాల ప్రవహిస్తున్నది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు నదిలోకి చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మట్టం



బోటులో వెళ్తున్న డీసీపీ భాస్కర్, ఏసీపీ, సీఐ, ఎస్ఐలు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ముంపు ప్రాంతాలను పరిశీలించిన డీసీపీ

వేమనపల్లి, జూలై 22 : వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుండగా, ముల్కలపేట, రాచర్ల ముంపు ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. రాచర్ల వద్ద ఉన్న బ్రిడ్జి నీటిలో మునిగిపోవడంతో బోటులో వెళ్లి చూశా రు. ముల్కలపేట నుంచి రాచర్లకు, రాచర్ల నుంచి ముల్కలపేటకు వెళ్లే ప్రజలను బోటు ద్వారా తరలించారు. వరదల్లో చిక్కుకున్నవారిని కాపాడేందుకు 44 మంది పోలీసులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఉన్నారు.




## కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా

మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

నస్పూర్, జూలై 22 : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు ఆందోళన బాట పట్టారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి శోభ మాట్లాడుతూ 19 ఏళ్లుగా కనీస వేతనాలకు నోచుకోకుండా పనిభారం ఎక్కువైనా విధులు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో సమ్మె చేస్తే రాష్ట్ర ప్రభుత్వం హామీలు ఇచ్చిందని, కానీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశ కార్యకర్తలకు ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చిందని వాటిని నెరవేర్చాలని కోరారు. నెలకు కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, ఆశాలు, పద్మ, విజయలక్ష్మి, సునీత, కవిత, సుజాత, అరుంధతి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుంది

### రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

మంచిర్యాలటౌన్, జూలై 22 : ఉద్యోగులకు పదోన్నతి మరింత బాధ్యత పెంచుతుందని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఏడుగురు ఏఎస్ఐలకు ఎస్ఐలుగా, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా, కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న 16 మందికి హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం వారిని సీపీ అభినందించారు. ర్యాంకుల వారీగా పదోన్నతి చిహ్నాలను వారికి అలంకరించారు. సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసున్న వారంతా క్రమశిక్షణతో, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, పోలీసులు, పోలీసుశాఖపై నమ్మకాన్ని, గౌరవాన్ని పెంపొందించాలన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు కష్టపడి పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని, కష్టపడి పనిచేసే ఉద్యోగులకు ఎప్పటికైనా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్)రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో అశోక్‌కుమార్, ఆర్ఐలు దామోదర్, మనోజ్‌కుమార్, సంధ్య, సీసీ గౌస్, రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.



పదోన్నతులు పొందిన పోలీసులతో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



నాటు పడవలో వెళ్తున్న వైద్య సిబ్బంది

## నాటు పడవలో వెళ్లి వైద్యం

*మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వేమనపల్లి, సుంపుటం మధ్యలోనున్న లోలెవల్ వంతెనపై నుంచి వరద ప్రవహిస్తుంది. ఈ మేరకు సోమవారం హెల్త్ అసిస్టెంట్ లింగయ్య నాటు పడవలో సుంపుటం గ్రామ పరిధిలోని జాజులపేట గ్రామానికి వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. గర్భిణులకు పలు సూచనలు చేశారు.*

*- వేమనపల్లి, జూలై 22*


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679